క్లుప్తంగా

పాఠశాలల అభివృద్ధికి ప్రణాళిక



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్ఎం కామేశ్వరావు

రాజానగరం: పాఠశాలల అభివృద్ధికి వార్షిక ప్రణాళిక ఎంతో ముఖ్యమని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం కామేశ్వరావు అన్నారు. శనివారం ఇక్కడ జరిగిన రాజానగరం స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించిన మౌలిక సదుపాయాలు, ఇతర అవసరాల కోసం అభివృద్ధి ప్రణాళికతోపాటు ఆవాస ప్రాంత ప్రణాళికను తయారు చేసి ప్రభుత్వానికి సమర్పించేలా మండల విద్యాధికారికి అందజేయాలన్నారు. దానిని బట్టే నిధుల మంజూరు ఉంటుందన్నారు.

చెరువు ఆలయ కమిటీదే..

తహసీల్దార్ సత్యనారాయణ రాజు

సీతానగరం: వెదుళ్లపల్లి పంచాయతీ పరిధిలోని రాజంపేట చెరువు ప్రైవేట్ ఆస్తి అని ప్రభుత్వానికి చెందినది కాదని తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ రాజు తెలిపారు. శనివారం సీతానగరం తహసీల్దార్ కార్యాలయంలో రాజంపేట చెరువు వివాదంపై మత్స్యకారుల సంఘం, రామాలయ కమిటీ సభ్యులతో కోరుకొండ సీఐ జి.ఉమామహేశ్వరరావు, ఎస్సై కె.శుభశేఖర్ చర్చించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సత్యనారాయణ రాజు మాట్లాడుతూ రాజంపేట చెరువు ఒక వంశానికి చెందిందని, దాని వారసులు రాజంపేట రామాలయానికి రాసి ఇచ్చారని, దీనికి సంబంధించిన ఆధారాలు ఉన్నాయన్నారు. ఈ చెరువును ఆలయ కమిటీ సభ్యులు వేలంపాట పెట్టుకోవచ్చని తెలిపారు. ఈ చెరువుపై ప్రభుత్వానికి ఎలాంటి హక్కులేదని చెప్పారు. మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు అప్పారావు న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

సీతానగరం: జనసేన పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల రాష్ట్ర కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి సూచించారు. శనివారం సీతానగరంలో జనసేన పార్టీ కార్యాలయాన్ని కోఆర్డినేటర్ వెంకటలక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో మట్ట వెంకటేశ్వరరావు, కాంద్రేగుల పోసిరత్నం, నాగారపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- నియోజకవర్గంలో 1505 కొత్త పింఛన్ల పంపిణీ

రాజానగరం: పేదల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. జీఎస్ఎల్ వైద్య కళాశాలలోని ఆడిటోరియంలో నియోజకవర్గంలోని సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాలకు చెందిన 1505 మంది పేదలకు కొత్తగా మంజూరైన సామాజిక పింఛన్లను శనివారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం కొత్తగా పింఛను పొందాలంటే అప్పటి వరకు పింఛను తీసుకుంటున్న వారిలో ఎవరో ఒకరు పోవాలన్నారు. అది కూడా జన్మభూమి కమిటీ సభ్యులు కరుణిస్తేనే దక్కేదన్నారు. కానీ జగన్ సీఎంగా అధికారంలోకి వచ్చిన తరువాత అటువంటి బేధభావాలను పక్కకు పెట్టి, అర్హత ఉంటే చాలు కుల, మతాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలను అందిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో కొత్తగా పింఛన్లు అందుకుంటున్న 1505 మందిలో ఏ ఒక్కరూ కూడా ఒక్క రూపాయి కూడా ఎవరికీ లంచం ఇవ్వలేదంటూ ఏమ్మా ఎవరికైనా ఇచ్చారా అని ప్రశ్నిస్తే సభలోని వారంతా లేదంటూ చేతులూపారు. టీడీపీ ప్రభుత్వంలో ఈ నియోజకవర్గంలో 29 వేల పింఛన్లు ఉండేవని, ఇప్పుడు 39 వేలు వరకు ఇస్తున్నామన్నారు. గతంలో పింఛన్ల కోసం రూ.2.90 కోట్లు కేటాయించగా, ఇప్పుడు రూ.10.5 కోట్లు అందజేస్తున్నామంటూ ఎమ్మెల్యే జక్కంపూడి గణాకాంతాలతో వివరించారు. ఈనేపథ్యంలో జనం కోసం పనిచేస్తున్న జగన్‌ని మరోసారి సీఎంని చేసి, మీ అభిమానాన్ని చాటుకోవాలన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు గజమాలతో ఎమ్మెల్యేని సత్కరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ సుభాషిని, ఎంపీపీలు మండారపు సీతారత్నం, గుర్రాల జోత్స్న, జెడ్పీటీసీ సభ్యులు వాసంశెట్టి పెదవెంకన్న, కర్రి నాగేశ్వర్రావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు దూలం పెద్ద, ఉల్లి బుజ్జి, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, నాయకులు గంగిశెట్టి సోమేశ్వర్రావు, క్రొవ్విడి సర్రాజు, కోలపాటి వెంకన్న, గండి నానిబాబు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

యేసు బోధనలు ఆచరణీయం

మధురపూడి: ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయమని రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. నర్సాపురం వైఎస్సార్ సీపీ నేత జ్యోతుల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో శనివారం గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే రాజా మాట్లాడారు. ఈ సందర్భంగా 200 మందికి రగ్గుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నర్సాపురం సర్పంచ్ కడియాల పాపారావు, వైఎస్సార్ సీపీ కోరుకొండ కోకన్వీనర్ గణేశుల పోసి, రాజానగరం కన్వీనర్ దూలం పెద్ద, నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి నుంచి జక్కంపూడి మెగా స్పోర్ట్స్ ఫెస్టివల్

మధురపూడి: కోరుకొండ మండలం గాడాలలో ఖేలో రాజానగరం కార్యక్రమం ఆదివారం నిర్వహించనున్నారు. ఈ క్రీడా ఉత్సవాల ఏర్పాట్లను వైఎస్సార్ సీపీ యువ నాయకులు జక్కంపూడి గణేష్ శనివారం పరిశీలించారు. జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జక్కంపూడి మెగా స్పోర్ట్స్ ఫెస్టివల్‌ను రాజానగరం నియోజకవర్గంలోని 3 మండలాల్లో నిర్వహించనున్నారు. ఈ నెల 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకూ జరగనున్నాయి. కోరుకొండ మండలం గాడాలలో వాలీబాల్, రాజానగరం మండలం పాలచర్లలో క్రికెట్, సీతానగరం మండలం సీతానగరంలో కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ(శాప్) చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ప్రారంభిస్తారని జక్కంపూడి గణేష్ తెలిపారు. ఆదివారం కోరుకొండ మండలం గాడాల ఎస్సీ కాలనీలో జరిగే వాలీబాల్ టోర్నమెంట్ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.



గాడాలలోని వాలీబాల్ క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు జక్కంపూడి గణేష్

ఉగాది నాటికి గృహప్రవేశాలు చేయాలి

- ఎంపీడీఓ రమేష్

సీతానగరం: గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో ఉగాది నాటికి గృహప్రవేశాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ కె.రమేష్ సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో మండల పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఎంపీడీఓ రమేష్ మాట్లాడుతూ ఉగాది నాటికి 199 ఇళ్లు పూర్తి చేసుకుని గృహ ప్రవేశాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో శంకుస్థాపనలు చేసిన ఇళ్ల పునాదులు వేయాలని ఆయన సూచించారు. హౌసింగ్ ఏఈ ఏవీ రామారావు మాట్లాడుతూ మహోత్సవాల్లో శంకుస్థాపన చేసిన ఇల్లు 1,338 ఉన్నాయని తెలిపారు. ఇల్లు నిర్మించుకునే వారికి ప్రభుత్వం హౌసింగ్‌లో శాంక్షన్ చేసి రూ.1.80 లక్షలు అందిస్తుందని, డ్వాక్రా మహిళలకు రూ.35 వేలు పైబడి బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ సుజాత, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ రామారావు

భూ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలి

గోకవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ సర్వేను సక్రమంగా త్వరితగతిన పూర్తిచేయాలని రాజమహేంద్రవరం ఆర్డీఓ చైత్ర వర్షిణి సూచించారు. మండలంలోని రంపయర్రంపాలెం పంచాయతీ పరిధిలో జరుగుతున్న భూ సర్వేను శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వే తీరును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, భూ సర్వే డిప్యూటీ తహసీల్దార్ రజని, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



సమగ్ర భూ సర్వేపై సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్డీఓ చైత్రవర్షిణి

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

పెదపూడి: పారిశుధ్య కార్మికుల సేవలు గుర్తించదగినవని ఈఓపీఆర్డీ కె.హరికృష్ణ సత్యరెడ్డి అన్నారు. రామేశ్వరం పంచాయతీ వద్ద శనివారం 9 మంది పారిశుధ్య కార్మికులకు నూతన దుస్తులను సర్పంచి కొటికలపూడి చినబాబు ఏర్పాటు చేశారు. వాటిని చినబాబు, హరికృష్ణ సత్యరెడ్డి పంపిణీ చేశారు. ఈవోపీఆర్డీ మాట్లాడుతూ ఏటా పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్మికులకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు అచ్చిరాజు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అనపర్తిలో..

అనపర్తి: సంక్రాంతి సందర్భంగా మండలంలోని రామవరం పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, కాంట్రాక్టు ఉద్యోగులకు శనివారం సర్పంచి గిరడా గంగాభవాని, ఉపసర్పంచి సబ్బెళ్ల కృష్ణారెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ గొలుగూరి గోవిందరెడ్డి చేతుల మీదుగా నూతన వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు పీవీ కృష్ణారెడ్డి, రామ్మోహన్‌లతో పాటు గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

ముగిసిన వెండి తాపడం మహోత్సవాలు

గోకవరం: గ్రామంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్ ఆలయంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న వెండి తాపడం మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. అమ్మవారి అంతరాలయాన్ని రూ.30 లక్షల విలువైన 50 కేజీల వెండితో తాపడం చేశారు. ఈ వెండి తాపడం మహోత్సవాన్ని పురస్కరించుకుని చివరి రోజు హైదరాబాద్‌కు చెందిన కంబాల శ్రీనివాస్‌రావు, గోకవరానికి చెందిన కంచర్ల సూర్యప్రకాష్ పులిహోర, చక్రపొంగలి ప్రసాదాన్ని వితరణ చేశారు. తొలుత ఆలయంలో అమ్మవారికి అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా లక్ష తులసి దళార్చన

బిక్కవోలు: గ్రామంలో కొలువైన లక్ష్మీనారాయణ స్వామి ఆలయం వద్ద శనివారం లక్షతులసీ పూజ వైభవరం నిర్వహించారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అమ్మవారి కుంకుమార్చన, అనంతరం స్వామికి 18 రకాల అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనపర్తి: మండలంలోని పీరారామచంద్రపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 33/11 కేవీ లైన్ మరమ్మతులు నిర్వహిస్తున్న కారణంగా నేడు ఆదివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు రామచంద్రపురం ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా పీరారామచంద్రపురం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు, ఇండస్ట్రియల్ సర్వీసులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

బిక్కవోలు: కొంకుదురులోని సీసీ రోడ్డు పనులను అధికారులు పరిశీలించారు. శనివారం గ్రామంలోని మెయిన్‌రోడ్డులో జెడ్పీ నిధుల నుంచి రూ.15 లక్షలతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. పంచాయతీ రాజ్ క్వాలిటీ కంట్రోలు డీఈ మెహన్‌రెడ్డి, డీఈ రఘురాం రోడ్డు పనులను పరిశీలించారు. ప్రస్తుతం పనులు ప్రారంభించడంతో అధికారులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో జిల్లా మహిళ సంక్షేమ సంఘం చైర్మన్ రొంగల పద్మావతి, ఎంపీటీసీ సత్తి నాగిరెడ్డిరాజా, రొంగల అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా శ్రీరామరాజు బాధ్యతల స్వీకరణ

రంగంపేట: మండల అభివృద్ధి అధికారి(ఎంపీడీవో)గా బి.శ్రీరామరాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీరామరాజు గతంలో రౌతులపూడి మండల ఎంపీడీఓగా పనిచేసి దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు. సెలవులు ముగియడంతో ఇప్పుడు రంగంపేట ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు.

కెనాల్ రోడ్డు దుస్థితిపై టీడీపీ నిరసన

అనపర్తి: వేమగిరి–సామర్లకోట కెనాల్ రోడ్డు దుస్థితిపై టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు శనివారం అనపర్తిలో కెనాల్ రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రోడ్ల పరిస్థితి చాలా అధ్వానంగా తయారయ్యాయని, రాష్ట్ర ప్రభుత్వం కనీసం రోడ్లపై పడిన గుంతలు పూర్తి స్థాయిలో పూడ్చలేని పరిస్థితి నెలకొందని విమర్శించారు.

ఇసుక అక్రమ తరలింపుపై కేసు

సీతానగరం: కూనవరం వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై కె.శుభశేఖర్ శనివారం తెలిపారు. ముగ్గళ్లకు చెందిన నిమ్మలపూడి మణికంఠ ఇసుక ర్యాంపు నుంచి ట్రాక్టర్‌పై అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా కూనవరం వద్ద పట్టుకొని కేసు నమోదు చేశారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

రంగంపేట: మండలంలోని దొంతమూరులో సర్పంచ్ గోలి రమణ ఆధ్వర్యంలో శనివారం పంచాయతీ కార్మికులు ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. మురుగు కాలువల్లో పూడికను తొలగించారు. రోడ్ల పక్కన చెత్తను జేసీబీ, ట్రాక్టర్ సహాయంతో బయటకు తరలించారు. మురుగునీటి గోతులను మట్టితో పూడ్చారు. మంచినీటి ట్యాంకుల వద్ద బ్లీచింగ్ పిచికారీ చేయించారు. వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున తగు చర్యలు చేపట్టినట్టు సర్పంచ్ రమణ తెలిపారు. గ్రామ వీధుల్లో దోమలు మందు, బ్లీచింగ్ పిచికారీ చేయించామన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

రంగంపేట: గడ్డి మందు తాగిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రంగంపేట మండలం వడిశలేరు గ్రామానికి చెందిన దుళ్ల రవి (23) పనికి వెళ్లకుండా ఇంటి వద్దే ఉండటంతో తల్లి మందలించింది. దీంతో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 5న ఇంటి పెరట్లో ఉన్న గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు అతన్ని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు ఎస్సై చెప్పారు.

నూతన రేషన్‌కార్డు అందజేత

రంగంపేట: చంద్రేడులో నూతనంగా మంజూరైన రేషన్‌కార్డును శనివారం పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన తామాడ దుర్గాదేవి తమకు రేషన్ కార్డు కావాలని ఇటీవల సచివాలయంలో నమోదు చేయించుకోవడంతో సచివాలయ సిబ్బంది రేషన్ కార్డు మంజూరు చేయించారు. ఈ కొత్త రేషన్‌కార్డును శనివారం సచివాలయ సిబ్బంది లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు జాస్తి సత్తిబాబు, డిజిటల్ అసిస్టెంట్, వలంటీర్ వెంకటేష్ పాల్గొన్నారు.

పీఏసీఎస్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నం పీఏసీఎస్‌ను అభివృద్ధి పరిచి, రైతులకు సేవలందించేలా చర్యలు చేపట్టాలని శనివారం బీజేపీ రాష్ట్ర నాయకులు ఏపీఆర్ చౌదరి డిమాండ్ చేశారు. రైతులు సొసైటీ కార్యాలయం వద్ద సత్యాగ్రహం కార్యక్రమాన్ని నిర్వహించారు. సొసైటీ దివాలా దుస్థితికి నిరసనగా ఈ ఆందోళన చేశారు.